


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 03-04-2026 | సంపుటి - 27 | సంచిక -311 | రూ : 4 | పేజీలు: 8


## మూసీ ప్రాజెక్టు పనుల్లో
# జోక్యానికి నిరాకరణ




- ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నందున కల్పించుకోలేం
- భారాస నేత పిటిషన్‌ను కొట్టివేస్తూ ఎన్జీటీ ఉత్తర్వులు
- అనుమతుల్లేకుండా పనులు చేపడితే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని స్పష్టీకరణ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నందున ఇందులో జోక్యం చేసుకోలేమంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై బెంచ్ తేల్చి చెప్పింది. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి, అనుమతుల్లేకుండా ఏవైనా పనులు చేపడితే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని సూచిస్తూ... భారాస నేత దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఎలాంటి పర్యావరణ అనుమతుల్లేకుండా మూసీ నదీ తరువాయి 2లో


## గ్యారంటీలపై సందేహాలుంటే
# తెలంగాణకు రండి

- అవినీతి, కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్.. విజయన్ ప్రభుత్వాలు
- కేరళలో యూడీఎఫ్ మ్యానిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2లో



## దేశాన్ని మళ్లీ నిర్మిద్దాం
# ఖమేనీ పిలుపు..

- అమెరికాజాయినిస్ట్ దాడులతో ధ్వంసమైన దేశాన్ని పునర్నిర్మించాలని ఇరాన్ సుప్రీం లీడర్ పిలుపు
- మినాబ్‌లో బాలికల పాఠశాలపై దాడిలో 186 మంది మరణించారని వెల్లడి
- ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా దేశవ్యాప్తంగా మొక్కలు నాటాలని ప్రజలకు సూచన
- శత్రువులు పర్యావరణాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని


2లో

దాడులు చేశారని ఆరోపణ
- ఇస్లామిక్ రిపబ్లిక్ డే సందర్భంగా దేశ ప్రజలకు మొజ్తబా ఖమేనీ సందేశం


2లో

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు
# నాసా చరిత్రాత్మక నిర్ణయం

- ఆర్టెమిస్-2 మిషన్‌లో వ్యోమగాములు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు నాసా అనుమతి
- సుమారు 50 ఏళ్ల తర్వాత చంద్రుడి వద్దకు వెళ్తున్న తొలి మానవసహిత యాత్ర ఇది
- ఈ ఫోన్లు ఏరోప్లేన్ మోడ్‌లో పనిచేస్తాయని, కేవలం కెమెరాలుగా ఉపయోగపడతాయన్న నాసా
- 10 రోజుల పాటు కొనసాగనున్న నలుగురు వ్యోమగాములతో కూడిన ఈ యాత్ర


## హర్మూజ్ సెగ నుంచి భారత్‌కు విముక్తి..
# ఇరాన్ అభయం!


2లో

- హర్మూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

# అమరావతి.. అఖండ దీప్తి

- మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించిన రాజ్యసభ
- రాష్ట్రపతి ఆమోదం పొందిన వెంటనే చట్టరూపం
- 149 నిమిషాలపాటు చర్చ
- 10 పార్టీల నుంచి మాట్లాడిన 16 మంది మద్దతు
- వ్యతిరేకించి, వాకౌట్ చేసిన వైకాపా 2లో




2లో

## అన్‌స్టాపబుల్

- చట్టబద్ధతతో అమరావతికి శాశ్వతత్వం తీసుకొచ్చాం
- రైతుల త్యాగాలు చరిత్రపుటల్లో నిలుస్తాయి
- త్వరలో అమరావతికి మోదీ.. ప్రారంభోత్సవాలకు హాజరు
- ఉద్దండరాయునిపాలెంలో సంబరాల్లో సీఎం చంద్రబాబు

## క్వాంటమ్ వ్యాలీతో
# డీప్ టెక్నాలజీ రీసెర్చ్ హబ్‌గా ఏపీ

- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్




కాకినాడ: 'అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నెలకొల్పడం గొప్ప ముందడుగు. క్వాంటమ్ కంప్యూటింగ్, కృతిమ మేధ, సెమీకండక్టర్ పరిశోధన, అధునాతన సాంకేతికతలన్నీ ఏకీకృతమవుతాయి. కొత్త తరం ఆవిష్కరణలు, ఉద్యోగ అవకాశాలు, శాస్త్రీయ నాయకత్వం పెరుగుతాయి. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను ఆసియాలోనే ఒక డీప్ టెక్నాలజీ రీసెర్చ్ హబ్‌గా మారుస్తాయి' తరువాయి 2లో

# హార్మూజ్ సెగ నుంచి భారత్‌కు విముక్తి.. ఇరాన్ అభయం!

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హార్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హార్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో BW TYR, BW ELM అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

## దేశాన్ని మళ్లీ నిర్మిద్దాం
## ఖమేనీ పిలుపు..

టెహ్రాన్, ఏప్రిల్ 02: అమెరికా జాయినిస్ట్ (అమెరికా, ఇజ్రాయిల్) శక్తులు ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండానే దాడులు చేసి విధ్వంసం సృష్టించాయని, ఈ దాడిలో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించి దేశాన్ని పునర్నిర్మించేందుకు దేశవ్యాప్తంగా కృషి చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే, జాతీయ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన ఈ సందేశం ఇచ్చినట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ ప్రెస్ టీవీ ఒక కథనంలో వెల్లడించింది. ఇటీవలి ఘర్షణల తర్వాత దేశ భవిష్యత్ శ్రేయస్సు కోసం జాతీయ ప్రయత్నాలు సాగాలని ఆయన స్పష్టం చేశారు. దివంగత అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడైన మొజ్తబా ఖమేనీ, శత్రువుల దాడులు కేవలం ప్రజలనే కాకుండా దేశ భూభాగాన్ని, సహజ పర్యావరణాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "క్రూరమైన అమెరికా, జాయినిస్ట్ శత్రువులు తమ అనాగరిక చర్యలలో ఎలాంటి మానవ, నైతిక పరిమితులు పాటించడం లేదు. ఇలాంటి సమయంలో దేశం అంతర్గత అభివృద్ధిపై దృష్టి పెట్టాలి" అని ఆయన వ్యాఖ్యానించినట్లు ప్రెస్ టీవీ పేర్కొంది. ఇరాన్ ఉజ్వల భవిష్యత్తు కోసం చేపట్టే ప్రతి ప్రయత్నం ఎంతో విలువైందని, అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన తన సందేశంలో నివాళులర్పించారు. ముఖ్యంగా దేశంలోని దక్షిణ నగరమైన మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో 186 మంది విద్యార్థినులు మరణించినట్లు ప్రెస్ టీవీ నివేదించింది. "పిల్లలను చంపే రాక్షస అమెరికా, జాయినిస్ట్ దుర్మార్గులు పాఠశాలలోని పసిమొగ్గలను కిరాతకంగా బలిగొన్నారు" అని ఖమేనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు – నాసా చరిత్రాత్మక నిర్ణయం

ఫ్లోరిడా, ఏప్రిల్ 2 : అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్ 2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది. రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హైఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS) మీదుగా వెళ్తున్నప్పుడు, అక్కడి వైఫైకి కనెక్ట్ అయి ఫొటోలు, ఈమెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు

## అమరావతి.. అఖండ దీప్తి



దిల్లీ : అమరావతిని పెద్దల సభ ఆశీర్వదించింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్ర హోం శాఖ తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు 2014 సవరణ బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. భవిష్యత్తులో వచ్చే ఏ ప్రభుత్వాలూ రాజధానిపై పిల్లిమొగ్గలేసి ప్రజాజీవితాలతో ఆడుకోకూడదన్న బలమైన సందేశాన్నిచ్చింది. బుధవారం లోక్‌సభ ఆమోదం పొందిన బిల్లును గురువారం మధ్యాహ్నం హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ దీనిపై చర్చకు అనుమతిచ్చారు. తొలుత ఇందుకు రెండు గంటలే కేటాయించినా సభ్యుల ఉత్సాహంతో అది 149 నిమిషాలపాటు సాగింది. కాంగ్రెస్, భాజపా సహా మొత్తం 11 పార్టీల నుంచి 17 మంది సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అందులో 10 పార్టీలకు చెందిన 16 మంది సభ్యులు ముక్తకంఠంతో అమరావతి బిల్లును స్వాగతించి ఆశీర్వదించారు. వైకాపా నుంచి మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి మాత్రం ఆరోపణలు చేసి వాకౌట్ చేశారు. మిగతా పార్టీల సభ్యులు ప్రాంతాలు, పార్టీలనే భేదం లేకుండా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. విభజన నాటి నష్టం ఇప్పటికైనా భర్తీ అవుతోందని సంతోషించారు. గత ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొని రైతులు, మహిళలు శాంతియుత ఉద్యమాలు నిర్వహించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటినందుకు ముక్తకంఠంతో అభినందించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దిన ఆయన హయాంలో అమరావతి కూడా అత్యుత్తమ నగరంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



అమరావతి: 'అమరావతి అన్‌స్టాపబుల్. అది అజేయం, అద్వితీయం, అజరామరం. ఆంధ్రులకు ఏకైక ప్రజారాజధాని అమరావతే. ఇప్పటి వరకు చిరునామా లేని మనకు చట్టబద్ధత ద్వారా ఒక చిరునామా సృష్టించుకున్నాం. దీన్ని అందరూ ఓనర్‌షిప్‌గా తీసుకోవాలి. నీ రాజధాని ఏదంటే.. అమరావతి అని గర్వంగా చెప్పాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో సవరణ బిల్లు ఆమోదం పొందడంతో ఉద్దండరాయునిపాలెంలో గురువారం సాయంత్రం రాజధాని రైతులతో కలసి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 'మన ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీకి, అన్ని విధాలా మద్దతిచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. దేశంలో ఉండే ప్రార్థనాలయాల్లోని పవిత్ర మట్టిని, జలాలను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశాం. పార్లమెంటు వద్ద పవిత్ర మట్టిని, యమునా జలాలను తీసుకొచ్చినట్లు అప్పట్లో ప్రధాని మోదీ చెప్పారు. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీల ఎంపీలు అండగా నిలిచి అమరావతికి తామంతా వెన్నంటి ఉన్నామని చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు. ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ మాత్రం విభేదించింది. వాళ్లను ఏమనాలో తెలియట్లేదు. శ్మశానం అని వారంటే.. ఈరోజున తిరుగులేని శాసనం చేసుకున్నాం.

### రైతుల త్యాగాలు మరువలేం

నాకు చాలా భావోద్వేగంగా ఉంది. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. 2019లో ప్రభుత్వం మారడంతో చీకటి రోజులు మొదలయ్యాయి. మూడు రాజధానుల పేరున ప్రజావేదికతో విధ్వంసాన్ని ప్రారంభించారు. భూములిచ్చిన రైతులకు వ్యవసాయం, ఆదాయం లేదు. కౌలు ఇవ్వలేదు. ఓ వైపు ఉద్యమం, మరోవైపు జీవనోపాధి, ఇంకోవైపు ఖర్చులు.. ఇవన్నీ చూసినప్పుడు రైతుల గురించి చాలా బాధేసింది. నావద్ద ఆరోజు డబ్బులు లేవు. జోలెపట్టి వసూలు చేసి ఉద్యమానికి స్ఫూర్తిగా అందించా. ఆ రోజు నేను, నా భార్య భువనేశ్వరి ఇక్కడికి వస్తే.. మీ ఆవేదన, మీరు చేసిన త్యాగం చూసి ఆమె తన రెండు గాజులు మీ ఉద్యమానికి సంఘీభావంగా ఇచ్చారు. ఎన్ఆర్ఐలతో సహా చాలా మంది ముందుకొచ్చారు.

## అన్‌స్టాపబుల్

### అమరావతి వీరవనితల ఘనత

చరిత్రలో రాణీరుద్రమ వంటి వీరవనితల గురించి చదువుకున్నాం కానీ.. అమరావతి చరిత్రలో ఈ ప్రాంత ఆడబిడ్డల ప్రతాపాన్ని, పట్టుదలను వారు చూపిన తెగువను మరిచిపోలేం. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముళ్లకంచెలు ఛేదించుకుని మీ వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. భాజపా నాయకులు మద్దతిచ్చారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం, అమరావతి నుంచి అరసవల్లి వరకు మీరు పాదయాత్రలు చేశారు. ఆపేయాల్సిన పరిస్థితులు ఏర్పడినప్పుడు విరమించాలని నేను చెప్పా. ఒక్క అడుగు తగ్గి రాబోయే రోజుల్లో పది అడుగులు సింహాల్లా వేద్దామన్నా. ఈ రోజున అందులో కీలక అడుగు వేశాం. మీ ఐకమత్యం వల్లే గెలిచాం. అమరావతి రాజధాని మాత్రమే కాదు. ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం. ఇక్కడే అమరలింగేశ్వరుడు కొలువై ఉన్నారు. కృష్ణమ్మ, దుర్గమ్మ అండగా ఉన్నారు. తాత్కాలిక ఇబ్బందులు వచ్చాయి కానీ... అమరావతికి ఎప్పటికీ అపజయం లేదు. 1631 రోజులు పోరాడిన మీ చరిత్ర, త్యాగాలు చరిత్రపుటల్లో ఉండాలి. అమరావతి వాస్తు బ్రహ్మాండంగా ఉంది. ఎవరూ ఒక్క అంగుళం కూడా కదపలేరు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తయారుచేసి జాతికి అంకితం చేస్తానని హామీ ఇస్తున్నా. అమరావతి ఆదర్శ రాజధాని మాత్రమే కాదు తెలుగు జాతికి గుండె, జాతి గౌరవం.

## మూసీ ప్రాజెక్టు పనుల్లో జోక్యానికి నిరాకరణ

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నందున ఇందులో జోక్యం చేసుకోలేమంటూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై బెంచ్ తేల్చి చెప్పింది. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి, అనుమతుల్లేకుండా ఏవైనా పనులు చేపడితే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని సూచిస్తూ... భారాస నేత దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఎలాంటి పర్యావరణ అనుమతుల్లేకుండా మూసీ నదీ తీర అభివృద్ధి ప్రాజెక్టు పనులు చేపడుతున్నారంటూ భారాస నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎన్జీటీ జ్యుడిషియల్ సభ్యులు పుష్ప సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు డాక్టర్ ప్రశాంత్ గర్గవలతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది జి.రాజగోపాలన్ వాదనలు వినిపించారు. ''గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు పొందకుండా పనులు మొదలు పెడుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రక్షిత ప్రాంతాలకు 10 కిలోమీటర్ల పరిధిలో చేపట్టే పనులపై పర్యావరణ ప్రభావ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, డీటైల్డ్ ప్రాజెక్టు నివేదిక లేకుండా పనులు చేపడుతున్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో పక్షి, కీటకాలు ఉన్నాయి. వాటి ఉనికికి భంగం వాటిల్లుతుంది'' అని వివరించారు.

* **రాజకీయ దురుద్దేశాలతోనే పిటిషన్: ఏఏజీ**

ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ''రాజకీయ దురుద్దేశాల్లో భాగంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ప్రతిపక్ష పార్టీ వ్యతిరేకిస్తోంది. రాజకీయాలకు ట్రైబ్యునల్‌ను వేదికగా చేసుకుంటున్నారు. పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలన్నీ రాష్ట్ర పర్యావరణ మదింపు అథారిటీ జారీ చేసిన విధివిధానాల పరిధిలోకి వస్తాయి. వీటికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు అవసరంలేదు. సాధారణంగా పనులు చేపట్టే ముందు ఎంవోయూఎఫ్ అనుమతులు తీసుకుంటాం. ఈ క్రమంలో దరఖాస్తు చేశాం. ఇలాంటి రాజకీయ పిటిషన్‌లను అనుమతించరాదు'' అని విజ్ఞప్తి చేశారు. వాదనలను విన్న ధర్మాసనం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుందని, ఈ దశలో ఫిర్యాదును స్వీకరించలేమని తెలిపింది.

## గ్యారంటీలపై సందేహాలుంటే తెలంగాణకు రండి

హైదరాబాద్: యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు... అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మ్యానిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''కేరళలో పినరయి విజయన్ హయాం ముగిసింది. ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుంది. కేరళలో గత పదేళ్లుగా విజయన్ ప్రభుత్వం కొనసాగుతోంది. అలాగే 2014 నుంచి సుమారు పదేళ్లపాటు కేసీఆర్ తెలంగాణను పాలించారు. కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలున్నాయి. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈ సారి కేరళలో వస్తుంది. విజయన్ మా పార్టీకి రాజకీయ ప్రత్యర్థి. మోదీలా మాట్లాడటం నాకు సాధ్యం కాదు. విమర్శించకుండా ఉండటం నా స్వభావం కాదు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ఠ వినియోగం, రాష్ట్రానికి రావాల్సిన నిధుల సాధన..మా ప్రాధాన్య అంశాలు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదు. అది ప్రజల హక్కు. యూడీఎఫ్ కార్మికుల కూటమి. ఈ కూటమిలో నిజాయతీ కలిగిన నాయకులున్నారు'' అని పేర్కొన్నారు.

## క్వాంటమ్ వ్యాలీతో
# డీప్ టెక్నాలజీ రీసెర్చ్ హబ్‌గా ఏపీ

కాకినాడ: 'అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నెలకొల్పడం గొప్ప ముందడుగు. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, సెమీకండక్టర్ పరిశోధన, అధునాతన సాంకేతికతలన్నీ ఏకీకృతమవుతాయి. కొత్త తరం ఆవిష్కరణలు, ఉద్యోగ అవకాశాలు, శాస్త్రీయ నాయకత్వం పెరుగుతాయి. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను ఆసియాలోనే ఒక డీప్ టెక్నాలజీ రీసెర్చ్ హబ్‌గా మారుస్తాయి' అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో వైస్‌ఛాన్స్‌లర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన 12వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. వేగవంతమైన సమాచార వ్యవస్థ, పునరుత్పాదక శక్తి, నానో టెక్నాలజీ, ఎలక్ట్రిక్, సమాచార విశ్లేషణ వంటి రంగాలు పరిశ్రమల రూపురేఖలు మార్చేస్తున్నాయన్నారు. క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించేలా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందించాలని కోరారు. తొలిసారిగా డిజీ లాకర్ ద్వారా ధ్రువపత్రాలను పొందే సేవలను బటన్ నొక్కి ప్రారంభించారు. టర్నోవర్‌లో 25 శాతం పరిశోధనలపైనే..: ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే శాంతా బయెటెక్నిక్స్ రీసెర్చ్ పురుడుపోసుకుందని డా.వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'మా సంస్థ టర్నోవర్‌లో 25 శాతం పరిశోధన, అభివృద్ధి పైనే వెచ్చిస్తున్నాం' అని పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాంకు రూ.కోటి విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. 202425లో బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులైనవారిలో ప్రతిభావంతులైన 33 మందికి 39 బంగారు పతకాలు అందజేశారు. వీరిలో 25 మంది అమ్మాయిలే. ఉన్నత విద్యాశాఖ కౌన్సిల్ ఛైర్మన్ కె.మధుమూర్తి, జేసీ అపూర్వభరత్, రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి

*** 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తానని 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ అన్నారు. గురువారం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్‌లోగల రామచంద్ర కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం, పార్కులో డివిజన్ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, వార్డు ఇంచార్జ్ సురేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు సమస్యలను కార్పొరేటర్‌తోపాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

*** క్రీడా ప్రాంగణం, పార్కుకు అంబాసిడర్‌గా నైనిక రజువా**

ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువాను రామవరం తెలంగాణ క్రీడా ప్రాంగణం, పార్కు అంబాసిడర్‌గా ఎంపిక చేస్తున్నట్లు కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ప్రకటించారు. డివిజన్ సభకు హాజరైన సుప్రియను నైనిక రజువా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ నైనిక రజువా మొక్కలు నాటుతూ పచ్చదనం పెంపొందించడంలో ముందుంటుందని తెలిపారు. నైనికను స్ఫూర్తిగా తీసుకుని మిగతా పిల్లలను కూడా మొక్కలు నాటేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. శుభ కార్యక్రమాలు, ప్రముఖులకు మొక్కలను అందజేస్తూ పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. రాబోయే రోజుల్లో పార్కులో పచ్చదనం మరింత పెంచేందుకు నైనిక రజువా బాధ్యత చేపట్టి, ఈ ప్రాంగణ అభివృద్ధికి అంబాసిడర్‌గా వ్యవహరించాలని కోరారు.

## విద్యార్థుల్లో భక్తి భావనలను పెంపొందించాలి

*** పాపిరెడ్డి నగర్ అధ్యక్షుడు చంద్రారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి : భగవంతునిపై భక్తిని, పెద్దలపట్ల గౌరవాన్ని చిన్నతనం నుంచి విద్యార్థుల్లో పెంపొందించాలని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బస్తీలోని శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్.ఆర్.విద్యాభవన్ హై స్కూల్ విద్యార్థులు ఆలయ ఆవరణలో హనుమాన్ చాలిసాను పఠించి ఆలయ కమిటీ, బస్తి కమిటీ సభ్యుల ప్రశంసలు పొందారు. కార్యక్రమంలో ఆర్.ఆర్.విద్యాభవన్ పాఠశాల నిర్వాహకులు సుబ్రమణ్యం, సూర్యకుమారి, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మరావు, సలహాదారుడు అనంత రాములు, కన్వీనర్ కె.వెంకటేష్, అధ్యక్షుడు అడెపు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుపతి రెడ్డి, కోశాధికారి పి.శంకర్ రెడ్డి, వెంకటేష్ చారి, శ్రీనివాసరావు, లక్ష్మి, సులోచన, రాణి, విజయలక్ష్మి, కవిత, సంతోషి, రోజా, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్నకు ఘన నివాళి

*** ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఆలస్యంపై నేతల ఆగ్రహం**



ప్రజాస్ఫూర్తి, కాప్రా: బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి సందర్భంగా మేడ్చల్‌మల్కాజిగిరి గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్ళులర్పించారు. పాపన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేసి నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్ల ఆనంద్ గౌడ్ గీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకుడు గోగికర్ శివకుమార్ వెనుకబడిన తరగతులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. మరో నేత విద్యాసాగర్ బడ్జెట్‌లో బీసీలకు తగిన కేటాయింపులు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బుడంపల్లి నిరంత్ గౌడ్, మిట్టపల్లి విజయ్ గౌడ్, తాళ్ల వెంకటేష్‌గౌడ్, రత్నపురం వెంకటేశ్వర్లు, రఘుపతి గౌడ్, గణేష్, రామకృష్ణ, పాండు గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల క్షేమమే పోలీస్ లక్ష్యం

*** మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్‌రెడ్డి.**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని షాదీఖానా వద్ద జరిగిన "ప్రజా పాలనవార్డు సభ" లో భాగంగా జిల్లా ఎస్పీ డా. శభరిష్ పి. ఐపీఎస్ ఆదేశాల మేరకు 21, 22, 23, 24, 25, 26 మరియు 36 వార్డులకు చెందిన మొత్తం 7 మంది కౌన్సిలర్లు, కాలనీ నివాసితులతో టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వారి వారి వార్డుల్లో, కాలనీలలో ద్విచక్ర వాహనదారులందరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందిగా కోరారు. అలాగే గంజాయి, మత్తు పదార్థాల వినియోగదారుల గురించి సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ముఖ్యంగా నేరాలను నివారించడానికి ప్రతీ వార్డుల్లో,కాలనీలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో "మన వార్డుమన భాధ్యత" అని మార్పు కనిపించేలా కృషి చేయాలని టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కోరారు

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : మొగల్ చక్రవర్తి ఔరంగజేబునే గడగడలాడించిన తొలి తెలుగు తేజం, బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ ఆత్మ బలిదాన్ దివస్ (వర్ధంతి) వేడుకలు షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షులు ఎడ్ల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కుల వృత్తుల వారినందరినీ ఏకం చేసి, గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగురవేసిన ధీశాలి పాపన్న అని కొనియాడారు. రాజ్యాధికారం కేవలం రాజవంశీకులకే పరిమితం కాదని నిరూపించిన ఆయన పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పేదల పాలిట ఆపద్బాంధవుడిగా నిలిచిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనమందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జండ్లగూడెం గోవర్ధన్ గౌడ్, గంగ్రతి బాలరాజ్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్, ఇతర యువజన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సర్వాయి పాపన్న ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకం

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : సర్వాయి పాపన్న ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధి అరవై గజాలు తెలుగు తల్లి నగర్ లో గురువారం నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గర్వకారణమైన మహా వీరుడు, సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. సర్వాయి పాపన్న అన్యాయానికి ఎదురు నిలబడి సామాన్య ప్రజల స్వేచ్ఛ, గౌరవం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహానుభావుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య మహాముని సంఘం అధ్యక్షులు ఎంఎస్.గౌడ్, సభ్యులు రాజు గౌడ్, రమణ, జి. హెచ్. రాజు, పవన్, వెంకటేష్, సుబ్బా రావు, కరాటే శ్రీను, శ్రీను, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, బలరాం రెడ్డి, కోలా శ్రీకాంత్, రాజ్ కుమార్, గుబ్బల లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ గౌడ్, తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి 'గూడెం'లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: రైతాంగాన్ని కాపాడటానికి, వ్యవసాయాన్ని రక్షించడానికి ఉద్యమాల రూపకల్పనకు కొత్తగూడెంలో ఈనెల 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మంచిగంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 50 శాతం మందికి పైగా వ్యవసాయం పైన ఆధారపడుతున్నారని, అటువంటి ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందని ఆయన అన్నారు. ఇటీవల బడ్జెట్‌లో రూ.53 లక్షల కోట్లతో ప్రవేశపెడితే 50 శాతం ఉన్న వ్యవసాయానికి కేవలం లక్ష అరవై వేల కోట్లు కేటాయించడం వ్యవసాయాన్ని దెబ్బ తీయడం తప్ప మరొకటి కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో లేని యాప్‌లు తీసుకొచ్చి వాటి ద్వారా ఎరువులు కొనుగోలు, అమ్మకాలు జరిగేటట్లు తీసుకురావడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం మాత్రమే అమలు చేసి పూర్తిగా అమలు చేసిన అని చెప్పేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమైన మహాసభల జయప్రదానికి జిల్లాలో ఉన్న రైతాంగం తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జలసూత్రం శివరాం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కున్సోత్ ధర్మ, కొండబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతి నిధులు ఏ పనులకు ఖర్చు పెట్టారు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, కాచనపల్లి గ్రామపంచాయతీ గ్రామసభలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.పలు అంశాలు ప్రసంగిస్తూన గ్రామ పంచాయతీ సెక్రెటరీ మాటలు విన్నాక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్శిక రాజు, బానోత్ రాంబాబు గ్రామ సభలో పాలు సమస్యలను తెలుసుకొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ జిపికి ఇచ్చిన ప్రభుత్వం నిధులు అక్షరాల 2,80,000 ఎందుకు దుర్నియోగం చేశారు. అడిగితే సెక్రటరీ చెప్పిన సమాధానం నేను ఎంబీ రికార్డు ప్రకారం తీశాను. మేము జిపి నిధులు దుర్వినియోగం చేయలేదు అన్నాడు. గ్రామపంచాయతీ సర్పంచ్ చెప్పిన సమాధానాలు నాకు ఏమీ తెలియదు అని చెప్పారు. కనిసం ఒక బాధ్యత గల పోస్టులో ఉండి ఊరు బాధ్యతాలు లెక్కలు చూసుకోవాల్సింది తనే నాకు తెలియదు అంటూ రూపాయలకు సంతకం ఎల పెట్టారు.మీరు పెడితేనే గా పైసలని తీసింది. దయచేసి ఈ లెక్కలు కరెక్ట్ సమాధానం చెప్పలేదు. వీటి మీద మాకు అనుమానం ఉంది. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, బయ్యారం మండల ఎంపీడీవో, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, కాచనపల్లి జిపి ఎంబీ రికార్డు ప్రకారం విచారణ చేసి మాకు న్యాయం చేయగలరు. గ్రామపంచాయతీ సెక్రెటరీ సిబ్బందులతో గల్లిలో ఉన్న సిసి రోడ్లును, చెత్తా ఊడ్చీ ట్రాక్టర్లలో పొయ్యడం లేదు. మొక్కజొన్న కొనుగోలు మినీ సెంటర్ కేంద్రం కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మూల మధుకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము వారన్నారు. మీకు మినీకేంద్రం ఏర్పాటు చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే, మధుకర్ రెడ్డిని,వ్యవసాయ అధికారి ఏఈఓ పిలిచి మొక్కజొన్నలు ఎంత క్రాప్ ఉంది. ఎంత దిగుమతి వస్తుంది అడిగారు. ఏఈఓ అక్కడ ఎక్కువ దిగుమతి ఉంటుంది అనడంతో మొక్కజొన్న ఎక్కువ పంట పండుతుంది. అనడంతో సరే మీకు మినీ కేంద్రం ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్టీఆర్ నగర్ లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కుత్బుల్లాపూర్ : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో సీనియర్ నాయకులు శివారెడ్డి, కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై అంజనీ సుతుడు హనుమాన్ కి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి, ధైర్యం, విజయానికి ప్రతీక హనుమంతుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, కాలనీ వాసులు శివా రెడ్డి, నాగేష్, రాజు గౌడ్, ముని, మధుసూదన్, శివా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, శ్రీనివాస్ రెడ్డి, ఎండీ. నసీరుద్దీన్, వెంకటేష్, రాకేష్ జలిగాం, నగేష్, డీజే రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ తన వ్యాఖ్యాలను ఉపసంహరించుకోవాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శ డండి సురేష్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం : కేరళ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పినరయ్ విజయన్ పట్ల చేసిన వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేసింది.ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు.విజయన్ను మోడీతో పోల్చటం అంటే రాజకీయ పబ్బంగడుపుకోవటమేనని బలమైన సిద్ధాంత బలంతో పనిచేసే ఎల్డీఎఫ్పై విమర్శలు చేయడం సరికాదన్నారు. బిజెపి వ్యతిరేక ఫ్రంట్లో వామపక్షాలు ఉన్నప్పుడు రేవంత్రెడ్డికి ఈ విషయాలు గుర్తుకు రాలేదా అని సురేష్ ప్రశ్నించారు. రేవంత్రెడ్డి ఏమి చూసి విజయన్ను మోడీతో పోల్చారని అధికారంలోకి రావడం కోసం ఇంత దిగజారుడు ప్రచారం తగదన్నారు. రాష్ట్రానికి ఒక మాట చెప్పి ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా

**- తీగుళ్ల చంద్రయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని సర్పంచ్ తీగళ్ల చంద్రయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో 99రోజుల ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభను గురువారం నిర్వహించారు. గ్రామంలో ముఖ్యంగా కోతుల, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని అఖిలపక్షం నాయకులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీగుళ్ల చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, రేషన్ కార్డుల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సత్తయ్య, వార్డు సభ్యులు బక్క బిక్షం, కల్పన, శ్రీనివాస్, కిషన్, ఓం ప్రకాష్, ధనలక్ష్మి, ముత్తమ్మ, శ్రీకాంత్, శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తీగుళ్ల బాలరాజు, దోర్నాల బిక్షపతి, ఊదరి రమేష్, చెక్క లింగస్వామి, దోర్నాల వాసుదేవ్ , జిపిఓ బాలమణి, సూపరింటెంట్ విజయ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, బాతరాజు సైదులు, వినయ్ రెడ్డి, మల్లయ్య, కిరణ్, మహిళా సంఘం సభ్యులు భాగ్యలత, వసంత, రమణ, నరసింహ, కారోబార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయ్యిన అనంతరం కాలనీలో మురుగు నీటి సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, శివరామ్ రెడ్డి, శ్రీనివాస్, పత్తి రామరెడ్డి, మల్లారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# త్వరలో జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి అమలు

* ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
* ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
* వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం
* వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లా కొక్క మండలంలో ప్రవేశపెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని విఠాయిపల్లి గ్రామంలో జరిగిన వార్డు సభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈరోజున ఆమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి గారు తెలిపారు. ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు ఏ అధికారి దగ్గరికి వెళ్లి ప్రాధేయపడవలసిన అవసరం లేదు తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాలిటీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్, రంగరెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ నూతన కార్యవర్గం ఖరారు*

* జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల రాజ్ కుమార్ నియామకం*



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన కార్యవర్గాన్ని పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సూచనల మేరకు వైస్ ప్రెసిడెంట్లు, ప్రధాన కార్యదర్శులు, ట్రెజరర్, ప్రతినిధులు మరియు కార్యవర్గ సభ్యుల నియామకాలకు ఆమోదం లభించింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాకాల రాజ్ కుమార్‌ను నియమించారు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్‌కు శ్రేయోభిలాషులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



షాద్నగర్, ప్రజాస్ఫూర్తి : హనుమాన్ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని 15వ వార్డు ఆంజనేయస్వామి గుడి దగ్గర కేశంపేట్ మాజీ జడ్పిటిసివిశాల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భర్త సాదిక్, సీనియర్ నాయకులు జమృద్ ఖాన్, స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ.. సైబర్ నేరాలపై అప్రమత్తత పెంచాలి

: ఎస్పీ రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులు-సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ, సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచిస్తూ, నమోదైన కేసుల పురోగతిని సమీక్షించారు. అనంతరం డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కోఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించి, జిల్లాలో నమోదైన సైబర్ నేరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆన్లైన్ మోసాల నుంచి ప్రజలను రక్షించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఆదినారాయణ, సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్, సీఐ జితేందర్, ఎస్సైలు రవి, ఉమ, జుబేదా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక

* జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
* మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి:



గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని మహబూబాబాద్ జిల్లా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి సమస్య పరిష్కారానికి బలమైన వేదిక గ్రామసభ అని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఎంఆర్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయ్యిన అనంతరం కాలనీలో మురుగు నీటి సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, శివరామ్ రెడ్డి, శ్రీనివాస్, పత్తి రామరెడ్డి, మల్లారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి

* అక్రమ ఇసుక రవాణాపై హెచ్చరిక




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. భూభారతి దరఖాస్తులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని, ప్రజావాణిలో భూ సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను బీఎల్ఓలు, మండలాల వారీగా విభజించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, లక్ష్యాలు నిర్దేశించి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. జనగణన ఏర్పాట్లు పూర్తిచేసి తహసీల్దారుల ఐడీ క్రియేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను గమనించిన కలెక్టర్, ఇసుక రీచ్‌లపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. భూసేకరణ పురోగతి, పెండింగ్ కోర్టు కేసులపై కూడా సమగ్ర సమాచారం ఇవ్వాలని అధికారులను కోరారు. వచ్చే వారంలో తహసీల్దారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, స్వర్ణలత, ఏడి మైన్స్ దినేష్, భూసేకరణ అధికారి యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక

* బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : హనుమాన్ జయంతి భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి కొండపై గల సాలాసర్ హనుమాన్ దేవాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అయన తో పాటు తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్, మల్లారెడ్డి హైల్త్ సిటీ వైస్ చైర్మన్ డాక్టర్.ప్రీతిరెడ్డి లు ముఖ్యఅతిథులుగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి శోభాయాత్రలు మన సంప్రదాయాలను పరిరక్షించే మహత్తర వేదికలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బి ఆర్ఎస్ అధ్యక్షులు రుద్ర అశోక్,బిఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్ స్థానిక నాయకులు ఏ.వేణుయాదవ్,సాలాసర్ హనుమాన్ దేవాలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## 99రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 6వార్డులో వార్డు సభ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం 6, 7వ వార్డ్ సభ జరిగింది. గ్రామ ప్రజలు పాల్గొని సమస్యలు తెలియజేశారు. వార్డు సభ సందర్భంగా 6వ వార్డులో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కొరకు సి. సి. రోడ్లు సీ.సీ. డ్రైనేజీ నిర్మాణము చేపట్టటం కొరకు 50లక్షల రూపాయల అంచనాతో. 2026 జనవరి 13న శంకుస్థాపన కార్యకమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహా దారులు వేం నరేందర్ రెడ్డి, మురళి నాయక్ శంకుస్థాపన చేశారని తెలిపారు. కానీ ఇప్పటివరకు కాంట్రాక్టు పనులు మొదలు పెట్టలేదని, తక్షణమే పనులు జరిగే విధంగా పరిష్కరించాలని వార్డ్ స్పెషల్ ఆఫీసర్ 6వ వార్డు కౌన్సిలర్ భూక్య బుజ్జి రాంజీ ఫిర్యాదు చేశారు. భూదాన్ యజ్ఞం బోర్డులో జరుగుతున్న అక్రమాలను అరికట్టి ఆ బోర్డులో ఉన్న ప్రభుత్వ భూమిని రక్షించి భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి అర్హులైన నిరుపేదలు ఎస్సీ. ఎస్టీ. బీసీ. లకు పంచాలని కోరారు. బతుకమ్మ ఘాట్ కు స్థలం లేక మహబూబాద్ నుండి మరిపెడ వెళ్లే 365 జాతీయ రహదారిపై వేడుకలు జరుపుకుంటున్నారన్నారు. 6వ వార్డు బేతోలు లో గత 16 సంవత్సరాలు క్రితం మొదలయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం ఇప్పటి వరకు నిర్మాణం పూర్తి కాలేదని,. దాన్ని కారణంగా ఇప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రైవేట్ బిల్డింగ్ లో నిర్వహిస్తున్నారన్నారు. ఇది కూడా శిధిలావస్థలో ఉంది కూలిపోయే స్థితిలో ఉన్నది దీనిని ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ పవన్ చంద్ర, వార్డు ఆఫీసర్ మనోజ్,జి పి ఓ రెవెన్యూ అధికారి హుస్సేన్,అర్జున్, హెల్త్ డిపార్ట్మెంట్ సంబంధిత అధికారులు దార వెంగళరావు, పోతు రాజు, ఆశ వర్కర్లు అంగన్వాడి టీచర్లు గ్రామ ప్రజలు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, షేక్ యూసుఫ్, అనపర్తి మదన్, తూముల శ్రీధర్, నాగినేని ప్రభాకర్, ఏర్పుల హుస్సేన్, షేక్ జావిద్, ఏర్పుల రాజు, ఏనుగంటి వెంకన్న, జినుక ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టులో వైభవంగా హనుమాన్ జయంతి



జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో గురువారం చిన్న జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన మాలధారులు దీక్ష విరమణ చేశారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు లక్షన్నర మందికి పైగా మాలధారులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. గిరి ప్రదక్షిణలో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 20 వేల మంది భక్తులు కొండ చుట్టూ ఆరు కిలోమీటర్ల దూరం నడిచిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

## ఘనంగా కళ్యాణ తిరుపతి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేస్ 1 లోని కళ్యాణ తిరుపతి దేవాలయ 18వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు వినోద్ కుమార్, విజయ్, గురుబ్రహ్మం, సుధాకర్, బ్రహ్మం, నాగిరెడ్డి, శంకరయ్య, శివాజీ, రంగా సుబ్బయ్య, వెంకట్ రావు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు , డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిషోర్ చారి, శ్రీనివాస్ రెడ్డి, ఎండీ. నసీరుద్దీన్, రాకేష్ జలిగాం, నగేష్, డీజే రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మకు ఘన వీడ్కోలు




ప్రజా స్ఫూర్తి;భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏడాది పాటు శిక్షణ కలెక్టర్‌గా పనిచేసిన సౌరబ్ శర్మకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. కలెక్టర్ అంకిత్ శిక్షణ కాలంలో శర్మ చూపిన నిబద్ధత, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం ప్రశంసనీయం. దివ్యాంగుల పాఠశాల డిజైన్ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది.పీవో రాహుల్ వైవిధ్యమైన జిల్లాలో మంచి అనుభవం సొంతం చేసుకున్నారు. ఢిల్లీలోని నీతి ఆయోగ్‌లో 6 నెలల శిక్షణకు వెళ్తున్నారు. సికిల్ సెల్ అనీమియా పై ప్రత్యేకంగా పని చేశారు. సౌరబ్ శర్మ, కలెక్టర్ అంకిత్, మాజీ కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకత్వం, అధికారుల సహకారంతో శిక్షణ పూర్తి చేశాను. తెలంగాణ సంస్కృతి తెలుసుకునే అవకాశం లభించింది.అధికారులు శర్మను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యా చందన, సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవో మధు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళి




ప్రజాస్ఫూర్తి, కాప్రా : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకుడు, బీసీ జాతీయ నాయకుడు తాళ్ల వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల ఐక్యతతో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, చిన్న సైన్యంతో ప్రారంభించి దాదాపు 16 వేల సైన్యాన్ని ఏర్పాటు చేసి గోల్కొండ కోటలో జెండా ఎగరవేశారని తెలిపారు. ఆయనను బలహీన వర్గాల తొలి చక్రవర్తిగా కొనియాడారు. తెలంగాణలో బీసీల ఐక్యత అత్యవసరమని, రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో వారికి తగిన న్యాయం జరగలేదని విమర్శించారు. కేవలం 3.8 శాతం కేటాయింపులు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అన్ని బీసీ సంఘాలు ఏకమై సమిష్టిగా కృషి చేసి భవిష్యత్తులో బీసీలకు రాజాధికారం సాధించాలన్నారు.

# ఉద్యాన వర్సిటీలో డిజిటల్, సుస్థిర వ్యవసాయ కేంద్రం

**ఫ్లోరిడా వర్సిటీ సహకారంతో ఏర్పాటు: తుమ్మల**



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం, అమెరికాలోని ఫ్లోరిడా విశ్వవిద్యాలయంతో కలిసి కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డిజిటల్, సుస్థిర వ్యవసాయ వ్యవస్థల కేంద్రం స్థాపిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అందులో కృత్రిమ మేధ, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ వంటి ఆధునిక సాంకేతికతలతో వాతావరణ మార్పులను తట్టుకునే పంటల అభివృద్ధి, నేల ఆరోగ్య సంరక్షణ, నీటి వినియోగ సమర్థత పెంపు వంటి అంశాలపై పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. ఫ్లోరిడా వర్సిటీ సహజ వనరులు, పర్యావరణ పాఠశాల డైరెక్టర్ రమేశ్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం మంత్రి తుమ్మలతో సచివాలయంలో సమావేశమైంది. వీసీ దండా రాజిరెడ్డి, మాజీ వీసీ రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధి, పలు ప్రాజెక్టుల్లో సంయుక్త భాగస్వామ్యంపై చర్చించారు. తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగు రంగాన్ని బలోపేతం చేయడానికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

# కేసీఆర్ కుటుంబానికి అది ముమ్మాటికీ ఏటీఎంనే

**భారాస ఆరోపణలపై కిషన్‌రెడ్డి ధ్వజం**



దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన వ్యాఖ్యల పట్ల కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ క్షమాపణలు చెప్పాలన్న భారాస ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా పని చేసిందని ఆరోపించారు. గురువారం రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా సురేశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కిషన్‌రెడ్డి ఆవేశంగా కౌంటర్ ఇచ్చారు. ''కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ పూర్తిగా మునిగిపోయింది. దానివల్ల ప్రయోజనం లేదని డ్యాం కమిటీ, కాగ్ నివేదికలో ఉంది. ఆ ప్రాజెక్టుకు కేంద్రం డబ్బులివ్వలేదని ఆరోపిస్తున్నారు. మరిదానికి కేసీఆర్ తన సొంత డబ్బు తెచ్చి కట్టారా? అవి ప్రజల డబ్బులే. వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి అప్పులు తెచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. అదంతా ప్రజాధనమే. నిర్మించేటప్పుడు ఇంజనీర్లు, నిపుణులను సంప్రదించలేదు. అందుకే ఈ దుస్థితి వచ్చింది. ఆ ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి పూర్తిగా ఏటీఎంలా మారింది. ఎన్నికలకు ముందు కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపించి కేసీఆర్‌ను జైలుకు పంపుతామని ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పటివరకూ ఎందుకు విచారణ జరిపించలేదో, కేసీఆర్‌ను ఎందుకు జైలుకు పంపలేదో సమాధానం చెప్పాలి'' అని డిమాండ్ చేశారు. ఏపీలో విలీనం చేసిన వాటిలో ఐదు గ్రామాలనైనా తిరిగి తెలంగాణలో కలపాలని కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలనూ కిషన్‌రెడ్డి తోసిపుచ్చారు. ''రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ముంపు మండలాల విలీనం చేయడం అన్నది కాంగ్రెస్ నిర్ణయమే. విభజన బిల్లులోనే ఆ అంశాన్ని పొందుపరిచారు. తర్వాత కేసీఆర్ సోనియాగాంధీ ఇంటికెళ్లి డిన్నర్ చేసి కాళ్లు పట్టుకున్నప్పుడు ఆ విలీన గ్రామాల గురించి గుర్తుకు రాలేదా? అప్పుడే ఎందుకు అడగలేదు?'' అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

# అమరావతికి చట్టబద్ధత రైతుల విజయం

**రేణుకా చౌదరి, కాంగ్రెస్ ఎంపీ**



దిల్లీ: 'ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ.. పార్లమెంటు బిల్లు పాస్ చేయడాన్ని రైతుల విజయంగా భావిస్తున్నా. 2019లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన వారు రాజధాని కోసం భూములిచ్చిన రైతులను ఎన్నో వేధింపులు, అవమానాలకు గురిచేశారు. రాజధాని లేక 12 ఏళ్ల పాటు పాలనాపరమైన సందిగ్ధత కొనసాగడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది. గత ముఖ్యమంత్రి రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడితే.. కేంద్రంలోని పెద్దలు ఆయనకు సహకరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అమరావతి నిర్మాణం కోసం ఒక కాలపరిమితితో కూడిన రోడ్‌మ్యాప్ ఖరారు చేయాలి. రాజధాని నిర్మాణంలో ఎందుకు జాప్యం జరిగింది? అందుకు కారకులెవ్వరు? నష్టపోయిన ప్రజలకు ఎవరు పరిహారం చెల్లిస్తారన్నది స్పష్టం చేయాలి. 2014లోని రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన అంశాల అమలుపై స్టేటస్ పేపర్ విడుదల చేయాలి.'

**పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలి**

తెలంగాణలో ఏళ్లుగా పెండింగ్‌లో పడిన రైల్వే ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విభజన చట్టం ద్వారా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గురువారం రాజ్యసభ జీరో అవర్‌లోనూ ఆమె మాట్లాడారు. 'అన్ని అనుమతులు, సర్వేలు, డీపీఆర్‌లు పూర్తయినా.. చాలా రైల్వే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. డోర్నకల్ మిర్యాలగూడ, రామగుండంమణుగూరు, కరీంనగర్‌హసన్‌పర్తి, భద్రాచలం కొవ్వూరు, పటాన్‌చెరుఆదిలాబాద్, బోధన్‌లాతూర్ కొత్తలైన్ల నిర్మాణం ముందుకు సాగడంలేదు. వికారాబాద్‌పర్లి, ముద్‌ఖేడ్‌పింపల్‌కుట్టి లైన్ల డబ్లింగ్, కాజీపేట సికింద్రాబాద్, వాడిగుంతకల్లు ట్రిపుల్‌లైన్ల నిర్మాణమూ పెండింగ్‌లోనే ఉంది. కాజీపేటలో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో చెప్పినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీనే అమలు చేయకపోతే ఎలా? ఇప్పటికైనా కేంద్రం స్పందించి అన్ని పెండింగ్ ప్రాజెక్టుల పనులను వెంటనే మొదలుపెట్టాలి' అని కోరారు.

**అన్నివర్గాల్లో సానుకూల వైఖరి ఉంది..**
**ఆర్.కృష్ణయ్య, భాజపా ఎంపీ**

'అమరావతిలో రాజధాని నిర్మాణానికి మేం పూర్తిగా సమర్థిస్తున్నాం. దీనిపై ఆంధ్రప్రదేశ్‌లోని అన్నివర్గాల ప్రజల్లో సానుకూల వైఖరి ఉంది. అమరావతి గొప్ప తాత్విక భూమి. బౌద్ధం, శైవం, వైష్ణవం అలరారిన తపోభూమి. అక్కడ ఏర్పాటు చేస్తున్న రాజధానిని అందరూ సమర్థించాలి. సీఎం చంద్రబాబు హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేశారో.. అమరావతినీ అదే రీతిలో ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఉంది.

# అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత: అధికారుల వెల్లడి



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం గురువారం పట్టణంలో వేగంగా కొనసాగింది. మున్సిపల్ పరిధిలోని మొత్తం 28 వార్డుల్లో అధికారులు ప్రణాళికాబద్ధంగా వార్డు సభలను నిర్వహించి, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో వార్డు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి ఈ ఈ, స్పెషల్ ఆఫీసర్ పి. రమేష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి గల్లీలో ఉన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. సభలో పాల్గొన్న కాలనీవాసులు ప్రధానంగా మౌలిక వసతుల కల్పనపై విన్నవించుకున్నారు. వార్డులో ఓపెన్ డ్రైనేజీ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను, దోమల ముప్పును వివరించారు. వార్డు సుమారు 3కిలోమీటర్లు పైగా ఉండటం, కొత్త కాలనిలలో కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, నూతనంగా నల్లా కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కాలనీలోని పార్కులను అభివృద్ధి చేసి, ప్రజల భద్రత నిమిత్తం ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గట్టిగా విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆమె మాట్లాడుతూ.. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా వార్డుల వారీగా సమస్యల జాబితాను సిద్ధం చేస్తున్నాం. ప్రజలు కోరిన విధంగా డ్రైనేజీ, సీసీ రోడ్ల వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చి, నిధుల లభ్యతను బట్టి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం" అని హామీ ఇచ్చారు. స్పెషల్ ఆఫీసర్ పి. రమేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వార్డు అభివృద్ధికి ప్రత్యేక నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ మాట్లాడుతూ... షాద్నగర్ పట్టణంలో 6వ వార్డు చాలా పెద్దగా ఉంటుందని, అభివృద్ధి పనులు సహితం చాలా బాగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహాయంతో గత రెండు ఏళ్లలో సుమారు 8కోట్ల పనులు జరిగాయాని, ప్రారంభం కావాల్సిన కొన్ని పనులను వెంటనే ప్రారంభించేలా చూస్తామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరింత అభివృద్ధి జరిగేలా చూస్తామని, అందుకే ప్రజాపాలన... ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలు సూచించిన అభివృద్ధి పనులు సహితం త్వరగా ప్రారంభించేలా చూస్తామని ఆయన ఈ సందర్భంగా వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లత శ్రీ శ్రీశైలం గౌడ్, వార్డు అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వావిలాల మల్లేష్ సాగర్, కాలనీ పెద్దలు మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కిరణ్ నాయక్, మున్సిపల్ సూపర్వైజర్ ఆర్. నరేష్, వార్డు ఇన్చార్జిలు సాయికిరణ్, రాజ్ కుమార్, వివిధ విభాగాల అధికారులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు షేరింగ్ తోనే చెక్

- **మాదాపూర్ పోలీసుల సర్వేలో ఆసక్తికర అంశాలు**



మాదాపూర్, ప్రజాస్ఫూర్తి : ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టేందుకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో ఈ మాన్యువల్ సర్వే చేపట్టారు. సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే 6,554 మంది ఎక్కువగా ఒంటరిగా ప్రయాణించడం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని అధికారులు వెల్లడించారు. ఒంటరి ప్రయాణాల కారణంగా సమయ నష్టం, అదనపు ఇంధన వ్యయం, ప్రమాదాల ముప్పు, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. వాహనాల నుంచి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిసినా కూడా అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సర్వేలో ట్రాఫిక్ ఏడీసీపీ I హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఐటీ ఉద్యోగులు, పౌరులు తమ ప్రయాణాల్లో చిన్న మార్పులు చేసుకుంటే ట్రాఫిక్ రహిత సైబరాబాద్ సాధ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ అధ్యక్షతన జరిగిన '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్య లక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, మండల స్పెషల్ ఆఫీసర్ డిఐఈఓ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, పంచాయతీ గుమస్తా రామకృష్ణ, బిల్ కలెక్టర్లు అమర్ నాథ్, సురేష్, కిషోర్, బోస్, పిచ్చయ్య, శానిటేషన్ సూపర్వైజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో
# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : హనుమాన్ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని 6వ వార్డులోని హనుమాన్ దేవాలయంలో కౌన్సిలర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా గురువారం దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. దేవాలయ ప్రాంగణంలో దాత గోపాల్ చారి సహకారంతో 6లక్షల తో నిర్మించిన రేకులు షేడ్, గ్రానైట్ పనులను నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, స్థానిక కౌన్సిలర్ రాజు నాయక్, పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు. వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు వావిలాల మల్లేష్ సాగర్, బాస రాజు, రాజు చారి, శ్రీకాంత్, శంకరయ్య, గోనెలశ్రీను, మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తొలిరోజు 'జేఈఈ' సులువు



హైదరాబాద్: దేశవ్యాప్తంగా జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్ తొలివిడతతో పోల్చుకుంటే.. చివరి విడత తొలిరోజు పరీక్షల్లో ప్రశ్నలు సులువుగా ఉన్నాయని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చివరి విడత జేఈఈ మెయిన్ గురువారం నుంచి ప్రారంభమైంది. జనవరిలో జరిగిన తొలి విడత పరీక్షలతో పోల్చుకుంటే ఈసారి తేలికగా ఉందని శ్రీచైతన్య అఖిల భారత ఐఐటీ కోఆర్డినేటర్ ఎం.ఉమాశంకర్ తెలిపారు. గతంలో ఎన్నడూలేనట్లుగా.. ఎన్‌టీఏ పరీక్షలు ప్రారంభమైన రోజే విద్యార్థుల సంఖ్య, పరీక్షలు జరిగే నగరాలు తదితర వివరాలతోపాటు విద్యార్థులకు పలు సూచనలతో కూడిన ప్రెస్‌నోట్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 11.23 లక్షల మంది అభ్యర్థులు హాజరవుతున్నారని ఎన్‌టీఏ పేర్కొంది.

# కాళేశ్వరం వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలి



దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన లేకుండా సభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడిన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ క్షమాపణలు చెప్పాలని భారాస ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులకు రూ.300 కోట్లు అవసరమైతే రూ.లక్ష కోట్లు నీళ్లలో కొట్టుకుపోయాయని చెప్పడం సభను తప్పుదోవ పట్టించడమేనని, ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. గురువారం రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం(సవరణ) బిల్లుపై జరిగిన చర్చలో సురేశ్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంటే ఒక శరీరం, రెండు కళ్లు అని కేసీఆర్ చెప్పారు. ఆయన అమరావతి శంకుస్థాపన కార్యక్రమంలో కూడా పాల్గొని ఆశీర్వదించారు. రాష్ట్రాలుగా విడిపోయినా అన్నదమ్ములుగా కలిసే ఉందామని పిలుపునిచ్చారు. అయినా తెలంగాణ ఏర్పాటుపై అక్కసుతో ఎంతోమంది, ఎన్నో అనవసర వ్యాఖ్యలు చేశారు. అవన్నీ దిగమింగుతూనే మేం సోదరభావంతో వ్యవహరిస్తున్నాం. విభజన బిల్లులో తెలంగాణకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? అంటే ఒక్కదానికీ సమాధానం లేదు. ప్రస్తుతం ఏపీ విభజన బిల్లుకు జరుగుతున్నది మూడో సవరణ. తొలి సవరణలో ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో కలిపారు. రాష్ట్ర అసెంబ్లీ అనుమతి, చర్చ లేకుండా ఆ నిర్ణయం తీసుకున్నారు. మహాభారతంలో పాండవులు ఐదు ఊళ్లు అడిగినట్లు మేం కూడా కనీసం ఐదు గ్రామాలైనా తిరిగి ఇవ్వమని కోరుతున్నాం. కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం నిర్మించాం. ఆ ప్రాజెక్టుపై పెట్టిన రూ.లక్ష కోట్లు నీటిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి సభాముఖంగా చేసిన ప్రకటన తప్పు'' అని సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. తర్వాత వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు.

# ఏడు మండలాలు ఏపీకి అప్పగించడంలో కిషన్‌రెడ్డి పాత్ర



హైదరాబాద్: రాజ్యసభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు, చరిత్ర వక్రీకరణలతో పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచారని భారాస శాసనసభా పక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ''ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం. విభజన చట్టానికి సవరణ తెచ్చి.. ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికీ భాజపా ప్రభుత్వమే. ఇందులో కిషన్‌రెడ్డికి పాత్ర కూడా ఉంది. ఆనాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్.. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఆ విషయాన్ని మర్చిపోయిన కేంద్రమంత్రి భారాసపైనే విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే.. నేడు కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, భాజపా చీకటి పొత్తుకు సాక్ష్యం. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం.. మీరు వస్తారా? విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా.. 8 మంది చొప్పున ఎంపీలున్న భాజపా, కాంగ్రెస్‌లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి'' అని హరీశ్‌రావు విమర్శించారు.

# 'కాజీపేట డివిజన్' ఆలోచన లేదు

**ద.మ.రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ**




హైదరాబాద్: ''దక్షిణ మధ్య రైల్వే జోన్ పునర్విభజన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా నూతన రైల్వే జోన్‌పై ఎప్పుడైనా అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది'' అని ద.మ.రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ గురువారం వెల్లడించారు. రైలు నిలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 202526లో ద.మ.రైల్వే సాధించిన ఫలితాల్ని వివరించారు. కాజీపేటను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటుచేసే విషయంలో రైల్వేశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. ప్రస్తుతం కొత్త డివిజన్ ఏర్పాటుచేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.



# ఆల్కహాల్‌పై కంట్రోల్ తప్పుతున్నారా?.!

మద్యం విపరీతంగా తాగడం వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. అది మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తుందంటున్నారు. ఆల్కహాల్ వల్ల మెదడులోని ఐదు ముఖ్యమైన ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయి. అవేంటో తెలుసుకుందాం.







### న్యూరో ట్రాన్స్ మీటర్ యాక్టివిటీ

న్యూరోట్రాన్స్‌మీటర్లు మెదడులోని నరాల సందేశాల మార్పిడిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆల్కహాల్ ఈ న్యూరోట్రాన్స్‌మీటర్ల పనితీరును మారుస్తుంది. ఇది ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది.

### మెదడు నిర్మాణం

అతిగా మద్యం తాగడం వల్ల మెదడు నిర్మాణంలో మార్పులు వస్తాయి. ఇది మెదడు కణజాల పరిమాణాన్ని తగ్గిస్తుంది. ద్రవంతో నిండిన మెదడు జఠరికల పరిమాణాన్ని పెంచుతుంది. ఫలితంగా వ్యక్తి ఆలోచనా సామర్థ్యం బలహీనపడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.

### న్యూరోకెమికల్ అసమతుల్యత

ఆల్కహాల్ ఎక్కువ తీసుకోవడం వల్ల న్యూరోట్రాన్స్‌మీటర్ల సున్నితమైన సమతుల్యత దెబ్బతింటుంది. ఈ అసమతుల్యత డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక వ్యాధులకు దారితీస్తుంది. అలాగే ఇది స్వీయ నియంత్రణను తగ్గిస్తుంది.

### మెసోలింబిక్ మార్గం

ఆల్కహాల్ డోపమైన్ స్థాయిలను పెంచడం ద్వారా మెదడు మెసోలింబిక్ వ్యవస్థను సక్రియం చేస్తుంది. ఇది ఆనందం ఉద్దీపన అనుభూతిని కలిగిస్తుంది. కాలక్రమేణా ఈ రివార్డ్ మార్గాలు పదేపదే మద్యం తాగడంతో సున్నితంగా మారతాయి.

### మెదడు పనితీరు

ఆల్కహాల్ సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలను ప్రభావితం చేస్తుంది. ఇది సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. రిస్క్ తీసుకునే ప్రవర్తనను పెంచుతుంది.

---

# పిల్లలు హైట్ పెరగాలంటే..

ప్రస్తుత జనరేషన్‌లో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. వారు పుట్టినప్పటి నుంచి పెరిగేదాకా జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. కొంతమంది పిల్లలు వయసుకు తగ్గట్లుగా హైట్ పెరగరు. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ముందుగా పిల్లలకి సరైన పోషకాహారం లభిస్తుందో లేదో గమనించాలి. పోషక విలువలు అందించకపోతే బిడ్డ ఎదుగుదల ఆగిపోతుంది. ఈ రోజుల్లో పిల్లలు ఫాస్ట్, జంక్ ఫుడ్స్ తినడానికి ఇష్టపడుతున్నారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచిది కాదు. పిల్లలు హైట్ పెరగడానికి కొన్ని ఆహారాలు అందించాలి.





### పాలు

పాలలో అన్ని రకాల పోషకాలు ఉంటాయి. పాలు సంపూర్ణ ఆహారం అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్ పిల్లల ఎముకలు, కండరాల అభివృద్ధికి తోడ్పడతాయి. పిల్లలకు ఉదయం సాయంత్రం పాలు తాగేలా చూసుకోవాలి.

### గ్రీన్ లీఫీ వెజిటబుల్స్

కొంతమంది పిల్లలు ఆకు కూరలు తినడానికి ఇష్టపడరు. బదులుగా ఆయిల్, జంక్ ఫుడ్‌ను ఇష్టపడతారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆకుపచ్చ కూరగాయలను తినిపించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇందులో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి పిల్లల ఎత్తును పెంచడంలో సాయపడుతాయి.

### పండ్లు


అన్ని వయసుల వారు పండ్లు తినమని సలహా ఇస్తారు. ఎందుకంటే ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ రోజు నుంచే పిల్లలకు పండ్లు తినిపించడం అలవాటు చేయండి.

### గుడ్డు

గుడ్లలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పిల్లలకు అల్పాహారంలో ఉడికించిన గుడ్లను తప్పక తినిపించాలి. ఇందులో ప్రొటీన్‌తో పాటు, పిండి పదార్థాలు, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరం పెరుగుదలపై పాజిటివ్ ప్రభావాన్ని చూపుతుంది.

---

# లివర్ డ్యామేజ్ లక్షణాలు ఇవే..




లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. బాడీలో జరిగే అన్ని పనుల్లో దీని సహకారం ఉంటుంది. ఇది శరీరంలోని మలినాలను బయటికి పంపిస్తుంది. అయితే కొన్ని కారణాల వల్ల లివర్ డ్యామేజ్ అవుతుంది. కానీ డ్యామేజ్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఆలస్యంగా తెలియడం వల్ల అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆల్కహాల్ తాగేవారిలో లివర్ వ్యాధులు ఎక్కువగా వస్తాయనడంలో సందేహం లేదు. కానీ వైరల్ ఇన్ఫెక్షన్, ఊబకాయం, జన్యు కారణాల వల్ల కూడా లివర్ సమస్యలు ఏర్పడుతాయి. ఇలాంటి సందర్భంలో వాటిని ముందుగా గుర్తించడం అవసరం. అలాంటి వాటి గురించి ఈ రోజు తెలుసుకుందాం.

### మలం రంగులో మార్పు

మలం మట్టి రంగులో మారితే లివర్ పనిచేయడం లేదని అర్థం. సిర్రోసిస్ వంటి వ్యాధులలో లివర్ వాపునకు గురవుతుంది. ఇది పొట్ట విస్తరణగా కారణమవుతుంది. పాదాలు, చీలమండల వాపు కూడా సంభవిస్తుంది. లివర్ వ్యాధి ఉన్న రోగులకు చర్మం కింద పిత్త లవణాలు పేరుకుపోవడం వల్ల నిరంతర దురద ఉంటుంది. ఈ దురద ఎక్కడైనా రావచ్చు కానీ అరచేతులు, అరికాళ్లలో ఎక్కువగా వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించి లివర్ టెస్ట్ చేయించుకోవాలి.

### అలసట, బలహీనత

నిరంతర అలసట, బలహీనత కాలేయ వ్యాధికి ప్రారంభ సంకేతాలు. ఇలాంటి సందర్భంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. పొట్ట పైభాగంలో నొప్పి లివర్ వాపునకు సంకేతం. ఈ నొప్పి తేలికపాటి నుంచి తీవ్రంగా మారుతుంది. కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత మరింత పెరుగుతుంది. లివర్ సమస్యల వల్ల మూత్రం రంగు మారుతుంది. ఈ స్థితిలో మూత్రం రంగు టీ రంగు లేదా గోధుమ రంగులోకి మారుతుంది.



## నష్టాల్లో ప్రారంభమై లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### బలపడ్డ రూపాయి



**ముంబై:** భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు క్లోజింగ్ సమయానికి కాస్త పుంజుకుని, స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ఒక దశలో ఏకంగా రూ.10 లక్షల కోట్లు మార్కెట్ నష్టపోయింది. ఇరాన్‌కు ట్రంప్ చేసిన హెచ్చరికలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల వద్ద భారీ నష్టంతో ప్రారంభమైంది.

అంతకుముందు రోజు మార్కెట్ 73,134.32 వద్ద ముగిసింది. అంటే దాదాపు 900 పాయింట్ల నష్టంతో గురువారం ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో ఇంకా నష్టపోయి ఏకంగా 71,545.81 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకున్న సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 185.23 పాయింట్ల (0.25 శాతం) లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా ఒక దశలో 496 పాయింట్లు నష్టపోయింది. తర్వాత 33.70 పాయింట్లు (0.15 శాతం) కోలుకుని 22,713 వద్ద ముగిసింది. ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్, యుద్ధం ముగియడానికి రెండు వారాలు సమయం పడుతుందని ప్రకటన చేయడంతో మార్కెట్లో అనిశ్చితి నెలకొంది. దీంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ తాజా రూల్స్ నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ కారణాలన్నింటి వల్ల మార్కెట్ నష్టాలకు గురైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్బీఐ బ్యాంకులు, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా వంటి సంస్థలు భారీగా నష్టపోయాయి. మరోవైపు రూపాయి విలువ బలపడింది. డాలర్‌తో మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 108 డాలర్లకు చేరింది. అలాగే, ఔన్స్ బంగారం ధర 4616 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు




**హైదరాబాద్:** పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది.

ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది.

సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు..

### చరిత్రలో తొలిసారిగా నాసా కీలక నిర్ణయం




**న్యూఢిల్లీ:** అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్-2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది.

రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు.

వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు.

అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హై-ఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం మీదుగా వెళ్తున్నప్పుడు, అక్కడి వై-ఫైకి కనెక్ట్ అయి ఫొటోలు, ఈ-మెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు.

# కోల్‌కతాపై సన్‌రైజర్స్

# ఘన విజయం

## ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన హైదరాబాద్






**కోల్‌కతా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదిరిపోయే బోణీ కొట్టింది. తొలి మ్యాచ్ లో ఆర్సీబీ చేతిలో ఓడిన హైదరాబాద్ జట్టు నేడు స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 65 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ నిర్దేశించిన 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకే కుప్పకూలింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48) ఆకాశమే హద్దుగా చెలరేగి పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అనంతరం హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52) హాఫ్ సెంచరీతో రాణించగా, తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (24 బంతుల్లో 39) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కోల్‌కతా బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ 4 వికెట్లు పడగొట్టాడు.

భారీ లక్ష్య ఛేదనలో కోల్‌కతా తడబడింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28) మెరుపు ఆరంభం ఇచ్చినా, అది ఎక్కువసేపు నిలవలేదు. అంగ్‌క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 52) అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. రింకూ సింగ్ (35) అతనికి కొంత సహకారం అందించినా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో కోల్‌కతా 16 ఓవర్లలోనే 161 పరుగులకు ఆలౌట్ అయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో జయదేవ్ ఉనద్కత్ 3 వికెట్లతో కోల్‌కతా పతనాన్ని శాసించాడు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఎషాన్ మలింగ చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. సన్ రైజర్స్ తన తదుపరి మ్యాచ్ ను ఏప్రిల్ 5న లక్నో సూపర్ జెయింట్స్ తో ఆడనుంది. ఈ మ్యాచ్ హైదరాబాద్ లో జరగనుంది.

## మైదానంలో వాగ్వాదం.. సోషల్ మీడియాలో క్లారిటీ ఇచ్చిన లక్నో ఓనర్



**లక్నో:** ఐపీఎల్ 2026 సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌లోనే లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓటమిపాలైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓటమి చెందడంపై జట్టు యజమాని సంజీవ్ గోయెంకా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఓటమి అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో ఆయన మైదానంలో తీవ్రంగా చర్చిస్తున్న వీడియోలు, ఫొటోలు వైరల్ అయిన నేపథ్యంలో ఆయన చేసిన పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. అనంతరం లక్ష్య ఛేదనలో ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే సునాయాసంగా విజయం సాధించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో కెప్టెన్ పంత్‌తో గోయెంకా ఏదో సీరియస్‌గా చర్చిస్తున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో జట్టులో ఏదో జరుగుతోందంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గోయెంకా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ అన్నింటికీ తెరదించారు. "ఇది చాలా సుదీర్ఘమైన సీజన్. అర్థవంతమైన దాన్ని నిర్మించే క్రమంలో ఇలాంటి క్షణాలు సహజం. మా కెప్టెన్, జట్టు బలం పుంజుకోగలరని నాకు పూర్తి విశ్వాసం ఉంది. ఈరోజు మద్దతుగా నిలిచిన మా అభిమానులకు ధన్యవాదాలు. మేం మరింత బలంగా తిరిగి వస్తాం. ఈ సీజన్‌లో లక్నో ప్రస్థానం ఇంకా ముగిసిపోలేదు" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో ఆయన జట్టుకు, కెప్టెన్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు.

## ఐపీఎల్ చరిత్రలో మహ్మద్ షమీ సరికొత్త రికార్డు..

### ఎవరికీ సాధ్యం కాని అరుదైన ఘనత!



**లక్నో:** లక్నో సూపర్ జెయింట్స్ స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఐపీఎల్ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే, షమీ ఈ చారిత్రక ఘనత సాధించిన మ్యాచ్‌లో అతని జట్టు లక్నో ఓటమి పాలైంది. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో లక్నో 6 వికెట్ల తేడాతో ఓడిపోయింది.

ఈ మ్యాచ్‌లో లక్నో నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను షమీ ప్రారంభించాడు. తొలి బంతికే ఢిల్లీ ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను ఔట్ చేసి జట్టుకు శుభారంభం అందించాడు. ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో తొలి బంతికే వికెట్ తీయడం షమీకి ఇది ఐదోసారి. ఈ ఘనత సాధించిన తొలి, ఏకైక బౌలర్‌గా షమీ నిలిచాడు.

ఈ జాబితాలో షమీ తర్వాత ఏడుగురు బౌలర్లు తలో మూడుసార్లతో రెండో స్థానంలో ఉన్నారు. వారిలో ప్రవీణ్ కుమార్, ఉమేశ్ యాదవ్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ, భువనేశ్వర్ కుమార్, అశోక్ దిండా, ప్యాట్ కమ్మిన్స్ ఉన్నారు.

అయితే, షమీ అద్భుత ఆరంభాన్ని లక్నో సద్వినియోగం చేసుకోలేకపోయింది. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన సమీర్ రిజ్వీ అద్భుతంగా రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ సునాయాసంగా విజయం సాధించింది. ఈ గెలుపుతో ఢిల్లీ తమ ఐపీఎల్ 2026 సీజన్‌ను ఘనంగా ప్రారంభించగా, లక్నోకు తొలి మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది.

## అంతర్జాతీయ క్రికెట్‌కు

# దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు..

### వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు.

"గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరఫున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు.

ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది. అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు.


అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరఫున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

**టాకీస్:** విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.



# రామాయణ టీజర్ విడుదల




టాకీస్: రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్‌ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు.దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.

MOVIE TIME

# డెకాయిట్ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి

## అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్



టాకీస్: టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిటల్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు.ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం.

# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?



**టాకీస్:** దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పుకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

# సోనాలి బింద్రేపై భూ కబ్జా ఆరోపణలు..

## బ్లాక్ మెయిల్ కోసమేనంటూ నటి ఫైర్!


టాకీస్: బాలీవుడ్ నటి సోనాలి బింద్రే భూ వివాదంలో చిక్కుకున్నారు. పూణె జిల్లా లోనావాలా సమీపంలో తన భూమిని సోనాలి కబ్జా చేశారంటూ స్థానిక రైతు ఒకరు పోలీసులను ఆశ్రయించారు. ఈ వార్తలు మీడియాలో రావడంతో సోనాలి బృందం వెంటనే స్పందించి, ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఇదంతా బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నమేనని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. లోనావాలాలో సోనాలి బింద్రేకున్న ఆస్తి పక్కనే తన పొలం ఉందని, ఆమె తన భూమిలోకి చొరబడి కంచె వేసుకున్నారని రైతు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రశ్నించేందుకు వెళ్లగా తనను బెదిరించారని కూడా ఆయన ఆరోపించారు. దీనిపై స్థానిక పోలీసులతో పాటు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ ఆరోపణలపై సోనాలి బింద్రే తరపు న్యాయవాదులు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు చేస్తున్న ఆరోపణల్లో



ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఆ భూమిని తాము నిబంధనలకు అనుగుణంగా, చట్టబద్ధంగా కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. తాము ఎవరి భూమినీ ఆక్రమించలేదని, భూమికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కేవలం సెలబ్రిటీ అయినందున, డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశంతోనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని సోనాలి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదుపై పూణె గ్రామీణ పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి, భూసర్వే నిర్వహించాలని నిర్ణయించారు. సర్వే పూర్తయితేనే భూమి ఆక్రమణకు గురైందా? లేదా? అనే విషయంపై స్పష్టత వస్తుందని అధికారులు వెల్లడించారు.

# తెలుగులో తొలి ఏఐ చిత్రం... అంబ ద రివెంజ్

**టాకీస్:** తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా



ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

# ఏడేళ్ల కల సాకారం కాబోతోంది

## రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ

**టాకీస్:** బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.